# అమరావతి

వైభవ దేవేంద్రుడు, వాసిరెడ్డి వెంకటాద్రి ప్రభువు. కృష్ణకు యిద్దరి అద్దరి మాగాణం అంతా చెక్కు చెదరని ధర్మవిక్రమంతో, ప్రజలకు తండ్రిగా, పెద్దలకు విధేయుడుగా, శాసనానికి తలవరిగా, శత్రువులకు చండశాసనుడుగా, ఏలుకుంటూన్న చల్లని హయాములో-

ఎళ్ళవేళలా, ఎండనక - నీడనక, విచ్చుకత్తులవారు, బరిసెలవారు, బల్లాలవారు, వీనుమిగిలిన వీరరాహుతు లందరూ పచ్చెపువాళ్ళ బాదరబందీ, ఏ పరగణాకు సోక నీకుండా వేయికన్నులుగా వేయికివేయి బాహువులుగా, పరాక్రమాల మెలగుతూ ఉండగా -

సింగారం పొలిమేరల్లో, ఎన్ని తరాలుగానో ఊడపాదుకున్న మర్రి - నీడను ఏనాడో, తలపండిన తబిసి చిన్న పర్ణశాలలో, బుర్లి తులసీబృందావనం మయంగా, కృష్ణాజినం మీద, చిత్రాసనంమీద, దర్భాసనంమీద పద్మాసనంగా - పొద్దు పొడిచిం దెరుగక, సంజకమ్మిం దెరుగక అలా కదలని కాలూ మూసిన కన్నుగా మనకు కానరాని, అదేదో మగతలో ఉండిపోయినాడు.

చివరకు ఎన్నాళ్ళకో ఓనాడు, ఆ తబిసిగుండెల్లో, బొమముడిలో చిక్కిన వెలుగు పట్టపగ్గాలులేక, ఉబికిఉబికి పండు వెన్నెలై రెక్కలకు అందనిమేరకూ పులుగులునేరని దూరాలకూ - ఎగిసిపడి ఎగబాకి, ఆకాశగంగై వరాహస్వామి ఉద్ధరించిన చేనంతా చిలకరించింది: తబిసి కన్ను తెరిచాడు.

తానై కన్ను తెరిచాడు: తనో మనిషి ననుకున్నాడు; తన్ను తా నెరిగినాక దగలున్నాయ్ దప్పికలున్నాయ్ - దాహమైంది తబిసికి. కమండలం ఉంది - ఉదకంలేదు.

ఎవరికీ పనికిమాలిందని ఎలుగెత్తనిమౌనం ఉరుములు పెట్టున గర్జించింది.

అమడదూరాన లేడల్లేపోతూన్న - నీడమనిషి ఒక్క చుట్టుతిరిగి, తబిసి ముందర గిరవాటుపడి, సొమ్మసిల్లబోతూ, నేనే అయ్యా, అని ఆ పాదాలకు మనవిచేసుకున్నాడు.

"నేనంటే"

"దొంగను."

"కావేమో!"

"నాకా అనుమానం లేదయ్యా!"

పుట్టింది దొంగ కడుపున
పెరిగింది దొంగ ఒడుపున
కాదంటే నాకు అవమానం కాదయ్యా!

అది మీ అజ్ఞానం –"

తలిసి, కనపడని కదలికతో, కనురెప్పతో రవంతగా, ఆ పలుకులకూ మ్రొక్కాడు–

"శపించనా!"

"కూడదయ్యా! చేసిన తపసంతా, నా పాపంమీద కత్తి పదునుగా ధారపోస్తారా!"

"శిక్షించే వరం – ఏ మహారాజుపరమో చేయండి" నీడ వెలుగులో మాయమైపోయింది.

పిండారీ మూకలు, దేశం గగ్గోలుచేస్తున్నాయ్. పరగణా అంతటా ఒకటే నరుకుల – వేట్లాట – మన్నె సుల్తానుకు ఈ బెడద చెవి సోకనీకుండా, ప్రజలే, ఏ వాడకు ఆ వాడను, ఏ సీమకు ఆ సీమను కాచుకుంటున్నారు.

సంకురాతిరి పండుగపూట, తెల్లవారకముందే వెంకటాద్రి ప్రభువు కృష్ణలో స్నానం చేస్తు ఉన్నపాటున ఉండి, ఉలికిపాటుగా "పట్టింది తాతగారూ!" అని, ధైర్యంగానే కేకవేశారు!

అల్లంత దూరాన జపం చేసుకుంటున్నారు – పాపయారాధ్యులవారు. వారు అరగన్ను గానే, "దేశానికా నీకా నాయనా!" అని తనలోతాను అనుకున్నారు.

పట్టింది మొసలే అయితే, ఆ మెలుకువ తెలుసును నాయుడికి. ఆ వేటలో తరతరాలుగా మొనగాడాయెను. కాని ఆ పట్టు మొసలిపట్టుకాదు ఆ ఒడుపు మొసలి ఒడుపు కాదు. కాలు కరకర మనలేదు. నీరు కందలేదు.

పట్టిన దొంగ పాదంవిడిచి ఉవ్వెత్తున నిలుచున్నాడు.

"ఎవరయ్యా!" అన్నారు ప్రభువులు.

"బతిమాలేందుకు పాదం పట్టినవాడినయ్యా! తల్లి కడుపున తారసిల్లాం – దానం చేయవయ్యా – దయా,జాలీ, ఆచేత, ఈచేత ధారపోయవయ్యా తండ్రీ!"

పాపయా రాధ్యులు – సందడిగా చేరువకు వస్తున్నారు – వస్తూనే సెలవిస్తున్నారు – "మరి, పలువిప్పకు మొనగాడా!"

అర్థమయ్యేట్టు చెప్పేవుసుమీ! ప్రభువులకు పాపభీతి బలిసి, పుణ్యానికి వేసగి వచ్చింది.

వెంకటాద్రినాయుడు తన మనసు ధారాదత్తం చేశాడు. దొంగ ఒక్క మునుకతో ఏటిపాలైపోయినాడు.

వేటలో పట్టితెచ్చిన మృగాలనూ వేడుక చూపించడం ప్రభువులకు అలవాటు. పిండారిమూకను పట్టి తెచ్చారని పరగణా అంతటా ఒక్క చిటికెలో సాటింపు అయింది. తిరునాళ్ళకు వచ్చింది ప్రజ –

ఒక్క బారున ఒకే వెన్ను విరుపున చింతలతోపులో ఉంది పిండారిమూక. అటునుంచినరుక్కు వస్తున్నాయ్ విచ్చు కత్తులు: ఇటునుంచి నరుక్కుపోతున్నాయ్ పట్టాకత్తులు, తలలన్నీ రాలినాయ్. ఒక్క తల మిగిలింది. అక్కడ అన్ని కత్తులూ ఆగినాయ్.

ఆ తల ఝళిపించింది. ఆ కళ్ళు కత్తులు సానబెట్టినాయ్. కాని ఏ చెయ్యీ ఆడలేదు! ఏ అడుగూ ఆడలేదు!

"నాయనా!" అన్నది గొంతు:

కన్నెదుట పిలిచేది. ఆ దొంగ పిలుస్తూన్నది, – పాపయారాధ్యులు.

"ఆఁ" అన్నాడు నాయుడు.

చేత కత్తి అందుకుని, ఓరగా చేరువయినాడు.

"ఏం ప్రభూ! దానంపట్టినవాడు ఈవరం మీపరం చేస్తున్నాడు. ఒక్కటే విసురు!"

ప్రభువు ఇంకా జంకుమీదే ఉన్నాడు.

"నీవు పిండారీవా?"

"కాను! అంతకన్న గండడిని. ఏం అయ్యా! ఎన్నిసార్లో పట్టి తెప్పించావు పిండారిమూకను. ఎందరినో నరికించావు కాని, ఎప్పటికప్పుడే జాలిపడి అటునుంచి నరికించి ఇటు విడిచావు; ఇటునుంచి నరికించి అటు విడిచావు. నీది దయ అనుకున్నావ్. అంతకే ధర్మమనుకున్నావ్. నీ జాలి మాకు చేటుకానా; మీ ధర్మం పరగణాకు ఆపదకానా, మాటికి మాటికి మంటలు ఆర్పావే కాని, చిటిలే రవ్వల్ని ఏం చేశావ్! ఇక చాలించయ్యా! నీకు ప్రజలకన్న దైవముందా, మా మేలుకన్నా పూజ ఉందా? – ఏలే ప్రభువుకు ఎవరు వంకబెడతారు? ఎదుటపడి, ఎవరు తప్పు దిద్దుతారు? నే నొక్కణ్ణే!"

ఏలేవారి తప్పు – నా తప్పుగాదా అనుకున్నా!

"ఎన్ని పుటకలుగానో పరగణాలో దోచుకు బతికేందుకు హక్కు మాకు ఉంది. పచ్చగా ఉన్నా దోచుకుంటే అందంకాని, అల్లాడిపోయే ప్రజను చూస్తే గుండె తరుక్కుపోయింది; అటూ చేయిపోలా, నా ధరమంమీద మనసూ పోలా.

చలిదన్నా ముట్టకుండా యిటూ పడివచ్చా! మర్రిక్రింద ఓ అయ్య ముక్కు మూసుకునిఉంటే సొరబుర్రలో నీరు కాసిని పుక్కిటపట్టినా! ఆ అయ్య కన్ను తెరిపించి కసిరించుకున్నా. ఒక్క ఉరకనువచ్చి, నీ పాదంపట్టినా – దానంపట్టినా దండులో కలిసి కాళ్ళబందామల్లే ఎటూ మెసలనీకుండా – మీచేత పట్టించినా.

నరికిన పుణ్యం మీదేగాని, నరికించిన పాపం నా కెందుకూ – విసురు!–"

నాయుడు ఆ కత్తితోనే ఆ చేతు లలా జోడించి "ఆమరేశ్వరా!" అన్నారు తగని జాలిగా.

"విసురు!"

విసురన్న మాట విసురున, కత్తి చళుకుమనడ మేమిటి, ఆ తల ఎగిరిపడడమేమిటి!

తలలేని మొండెం తపసులో ఉన్నట్టు పద్మాసనం వేసింది – తడువుకోకుండా వచ్చి, జీవంతో వున్న వేలు ప్రభువు నొష్టను తిలకం అద్దింది, నెత్తురు జీరతో.

ఆ దొంగ ఆచోకీ లేదు. ఆచోటి కిప్పుడు ఆనవాలు లేదు; ఆ కథా కమామీషూ నిన్నా మొన్నా పుట్టినవాళ్ళకు ఎరికేలేదు!

నాయుడి పేరు శిలాక్షరంగా ఉంది! ఆ ప్రభువు ధర్మం నూటొక్క గుడిలో దివ్వై వెలుగుతూంది – ఎవరి తపసో నిలిచింది. ఎలాగో వెలిసింది అమరావతి.

★ ★ ★